






శ్రీధర్



కళాశాల అధ్యాపకులు, కమిటీ వారితో శ్రీధర్(ఫైల్ ఫోటో)

పురం వాసికి పద్మశ్రీ

పురస్కారాన్ని అందుకున్న శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణ వాసి శ్రీధర్‌కు దేశం గర్వించ దగ్గ పద్మశ్రీ అవార్డు దక్కింది. శ్రీధర్ హిందూపురం పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో 1973-76 సంవత్సరంలో బీకాం పూర్తి చేశారు. అనంతరం ఇదే కళాశాలలో అధ్యాప కులుగా విధులు నిర్వహించారు. బెంగుళూరు యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి ప్రొఫెసర్, డీన్, డైరెక్టర్‌గానూ పనిచేశారు. బెంగుళూరులోని చాణక్య యూనివర్శిటీ ఛాన్సలర్‌గా పని చేశారు. 2009 నుంచి 2013 వరకు కర్నాటక నాలెడ్జ్ కమిషన్ మెంబర్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యులు, ఆల్ ఇండియా బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఎఐసిటిఇ సభ్యులు, ప్రస్తుతం యుజిసి న్యూఢిల్లీ సభ్యులు, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌గా ఉన్నారు. విద్యారంగంలో శ్రీధర్ చేసిన సేవలను గుర్తించి కర్ణాటక ప్రభుత్వం కర్నాటక రాజ్యోత్సవ అవార్డు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ నుంచి జనరల్ ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. ప్రస్తుతం ఆయనను భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. శ్రీధర్ మేనేజ్‌మెంట్‌లో స్ఫూర్తిదాయకమైన ప్రొఫెసర్, పరిశోధకుడు, ఇన్‌స్టిట్యూషన్ బిల్డర్, వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకులు. నలభై సంవత్సరాలకు పైగా బోధన, పరిశోధన అనుభవం ఉంది. హిందూపురం నుంచి గతంలో పద్మశ్రీ అవార్డు కల్లూరు సుబ్బారావుకు వచ్చింది. ఇప్పుడు ఎంకె.శ్రీధర్‌కు పద్మశ్రీ రావడంపై పురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ విద్యాసాగర్ పద్మశ్రీ శ్రీధర్ కలిసి చదువుకున్నారు.

పలువురు కమిషనర్ల బదిలీ

ప్రజాశక్తి- అనంతపురం కార్పొరేషన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భాగ్యలక్ష్మి గ్రీన్ అండ్ బ్యూటిఫుల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌గా ఫారిన్ సర్వీసెస్ కింద నియమించారు. అదనపు కమిషనర్ రమణారెడ్డిని పులివెందుల కమిషనర్‌గా బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ సావిత్రిని ఆమె మాత సంస్థ మెప్మా ఎమ్‌డి వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. ఆమె స్థానానికి ఎన్.గూడూరు కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్ శేషన్నను తెనాలి కమిషనర్‌గా బదిలీ చేశారు. గుంతకల్లు కమిషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరు కమిషనర్‌గా నియమించారు. వెంకటరామయ్యను గుంతకల్లు కమిషనర్‌గా నియమించారు. రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డిని నగిరి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. కడప అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బివి.నర్సారెడ్డిని కళ్యాణదుర్గం కమిషనర్‌గా నియమించారు. హిందూపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ప్రమోద్‌కుమార్‌ను జమ్మలమడుగు కమిషనర్‌గా నియమించారు.

జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

- కలెక్టర్ అరుణ్‌బాబు
- పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకావిష్కరణ
- ఆకట్టుకున్న శకటాలు
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రగతి పథంలో జిల్లాను నడిపించేందుకు ప్రజలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులందరూ సమిష్టగా పని చేయనున్నట్లు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పుట్టపర్తి పట్టణం వద్దనున్న పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం పరేడ్ వీక్షణ చేసి, సాయుధ దళాల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రగతి, అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలు, సాధించిన ప్రగతి గురించి వివరించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, అన్ని శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వమిస్తున్న ప్రతి పైసా పారదర్శకంగా అట్టడుగునున్న నిరుపేదలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ జిల్లా యంత్రాంగానికి సహకరమందివ్వాలని కలెక్టర్ అరున్‌బాబు కోరారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరిస్తూ ప్రజలకు సందేశం ఇచ్చారు. డా॥ వై.ఎస్.ఆర్ రైతుభరోసా పిఎం కిసాన్ ద్వారా జిల్లాలో 2,79,556 కుటుంబాలకు రూ. 320.07 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇన్ ఫుట్ సబ్సిడీ కింద 2019-20 సీజను నుంచి 2022-23 సీజను వరకు పంట నష్టపోయిన 14,507 మంది రైతులకు రూ.11.51 కోట్ల పరిహారం అందించామన్నారు. పంటల బీమా ద్వారా ఖరీఫ్ 2022 సీజను వరకు పంటలు నష్ట పోయిన 1,73,760 మంది రైతులకు రూ.157.64 కోట్ల బీమాను అందిచామన్నారు. జిల్లాలో ఉద్యానవన అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు తెలియజేశారు. పట్టు పరిశ్రమ అభివద్ధికి ఈ ఏడాది ఇప్పటివరకు రూ. 6.29 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జకలకళ ద్వారా 454 బోరు బావులను ప్రభుత్వం తవ్వించిదన్నారు. ప్రభుత్వం పెంచిన వైఎస్ఆర్ పింఛన్ కానుక రూ.3వేలను జనవరి నెల నుంచి జిల్లాలో 2,74,839 మందికి అందిస్తున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్ చేయూత, జగనన్న తోడు ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది బ్యాంకు లింకేజీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 14,781 సంఘాలకు రూ.910.51 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 2,673 సంఘాలకు రూ. 323.84 కోట్లు రుణాలు పంపిణీ చేశామన్నారు. అమ్మఒడి కార్యక్రమం ద్వారా జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 1,62,097 మంది తల్లులకు రూ. 210.72 కోట్లు అందించామన్నారు. మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు. గహ నిర్మాణ పథకం ద్వారా జిల్లాకు మొత్తం 69,605 ఇళ్లు మంజూరు కాగా, 59,606 ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. వీటిలో ఇప్పటికే 17,552 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతుల అంచనా వేసేందుకు చేపట్టిన కులగణనను జిల్లాలో జరుగుతోందన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ సాయాన్ని లబ్ధిదారులకు అందజేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు చేర్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం పని చేస్తోందని కలెక్టర్ వివరించారు.

ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతి ప్రదర్శనలు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసు జాగిలాలు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ప్రతిభ చూపిన బుక్కపట్నం కేజీబీవీ ప్రథమ స్థానం, ధర్మవరం జీవనజ్యోతి రెండవ, పుట్టపర్తి కేజీబీవీ విద్యార్థులు తతీయ స్థానంలో నిలిచి బహుమతులు పొందారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. ఇందులో మొదటి స్థానం రెవెన్యూ, రెండవది జిల్లా పంచాయతీ, విద్యాశాఖ శకటాలు తృతియస్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమాల్లో ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఎ.రమణారెడ్డి పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



వేడుకలను తిలకిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు

తమ్ముళ్ల తగాదాలు

- ఎన్నికల వేళా వీడని విభేదాలు
- 'బాబు' దారికితెచ్చేరా..!
- నేడు ఉరవకొండలో 'రా కదలిరా'
- హాజరుకానున్న టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు ముంచుకొస్తున్నా తమ్ముళ్ల మధ్య తగవులు వీడటం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు, మూడు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల గ్రూపు తగాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి 2019 ఎన్నికలకు ముందు కూడా ఉండేవి. వీటి నడుమే ఓటమిని చవి చూసింది. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 నియోజకవర్గాల్లో టిడిపి ఓటమి చెందింది. రెండు పార్లమెంటు స్థానాలనూ కోల్పోయింది. ఇంతటి గడ్డు పరిస్థితులను టిడిపి ఎన్నడూ ఎదుర్కొనలేదు. ఈ ఫలితాల తరువాత అయినా నేతల్లో మార్పు వచ్చి ఏకతాటిపైకొస్తారనుకుంటే అదీ లేదు. ఇప్పటికీ అవే విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సమన్వయం చేసేందుకు పలుమార్లు అధిష్టానం తీసుకున్న చర్యలు కూడా ఫలించలేదు. ఒకవైపు అధికార వైసిపి ఇప్పటికే ఎన్నికలకు సమయత్తమయ్యే పనిలోనుంది. ఎక్కడైనా నేతల మధ్య విభేదాలున్నా వాటిని సమన్వయపరిచే బాధ్యతలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేస్తున్నారు. ఇప్పటికే సగం నియోజకవర్గాలకు అభ్యర్థులను వైసిపి ప్రకటించి ఎన్నికలకు అన్ని విధాలుగా సమయత్తమవుతోంది. తెలుగుదేశం పార్టలో ఇప్పటికీ నియోజకవర్గాలపై స్పష్టత లేదు. టికెట్టు కోసం నాయకులు మాత్రం పెద్ద ఎత్తునే పోటీపడుతున్నారు. గ్రూపులు నడుస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా చూస్తే కళ్యాణదుర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరిల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులున్నాయి. 2019 ఎన్నికల ముందు నుంచి ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. శింగనమల నియోజకవర్గం ఎస్సీ రిజర్వులోనూ టుమెన్ కమిటీకి, బండారు శ్రావణికి మధ్య తగాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాయదుర్గంలో అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిల మధ్య పొసగడం లేదు. మడకశిర ఎస్సీ రిజర్వులోనూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిల మధ్య విభేదాలు తారా స్థాయిలోనే నడస్తున్నాయి. ఒకరినొకరు సహరించుకునే పరిస్థితి లేదు. కదరిలో కందికుంట వెంకట ప్రసాద్, చాంద్‌బాషాల మధ్య ఇప్పటికీ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పెనుకొండలో సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి, సబితాల మధ్య పోరు నడుస్తోంది. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎవరికి టిక్కెట్టు ఖరారు చేసినా మరొకరు సహకరించే పరిస్థితి లేదు. వీటి నడుమ త్వరలో వచ్చే ఎన్నికలకు ఏ రకంగా సమయత్తమవుతుందన్న సందేహాలున్నాయి. టిడిపి బలమైన క్యాడర్ ఉన్నా నేతల మధ్య విభేదాలతో వారు కూడా ఏ రకంగా పనిచేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లోనున్నారు. నేడు చంద్రబాబు 'రా కదలిరా' కార్యక్రమంలో ఉరవకొండలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. రాత్రికి కూడా ఇక్కడే బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నేతలతో మాట్లాడే అవకాశమున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నారు. ఆ సమయంలో నియోజకవర్గాల నేతలతోనూ మాట్లాడి కొంతవరకు దిశానిర్దేశం చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

నేడు చంద్రబాబు పర్యటన

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నేడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం సాయంత్రం ఉరవకొండలో జరిగే 'రా కదలిరా' కార్యర్రకమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3.40 గంటలకు ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో ఉరవకొండకు ఆయన చేరుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం రాత్రికి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు అంటే ఆదివారం ఉదయం 9.45 గంటలకు ఇక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో నెల్లూరు జిల్లాకు వెళ్తారు.

ఉరవకొండలో ఏర్పాట్లు పరిశీలన

ఉరవకొండ : చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ టిడిపి నాయకులతో కలిసి శుక్రవారం నాడు పరిశీలించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులుతో పాటు స్థానిక టిడిపి,జనసేన నాయకులతో కలిసి సభా ప్రాంగణంతోపాటు హెలీప్యాడ్ వద్ద పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న రా కదిలా రా కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోందన్నారు. ఉరవకొండలో జరిగే ఈకార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి తెలుగుదేశం,జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఉరవకొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు

కలెక్టర్ సారూ.. న్యాయం చేయండి..!

భూముల కోసం దళితుల నిరసన



లేపాక్షి తహశీల్దార్ కార్యాలయం ఎదుట కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని మొకాళ్లపై నిరసన తెలుపుతున్న దళితులు

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి రెవెన్యూ అధికారులు కుశలవా ఆర్గానిక్ ప్రొడక్ట్స్ వారితో కలిసి భూ రికార్డులను మార్చి తమ భూములను వారికి కట్టబెడుతున్నారని దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని బాధిత దళిత రైతులు కోరారు. న్యాయం చేయాలని కోరుతూ గణతంత్ర దినోత్సవం రోజున లేపాక్షి మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. 'కలెక్టర్ స్పందించి న్యాయం చేయండి.. మా భూములను మాకు ఇప్పించండి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలల తరబడి న్యాయం కోసం ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా తమ సమస్యలను ఎవరూ పరిష్కరించలేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించి, న్యాయం చేయాలని కోరామన్నారు. ఆయన స్పందించి కలెక్టర్‌కు సిఫార్సు చేస్తూ లేఖ ఇచ్చారన్నారు. ఆ లేఖను కలెక్టర్‌కు ఇచ్చి న్యాయం చేయాలని కోరినప్పటికీ ఇప్పటి వరకు తమకు న్యాయం జరగలేదన్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహశీల్దార్, ప్రస్తుత తహశీల్దార్ బాబులు కలిసి కుశలవా ఆర్గానిక్ ప్రొడక్ట్స్ వారికి కుమ్మక్కు అయ్యి లేపాక్షిలో కాకుండా హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో రాత్రి సమయాల్లో కుర్చోని భూ రికార్డులను మార్చారన్నారు. వీటిన్నింటినీ ఆధారాలతో సహా బయట పెట్టినప్పటికీ వారిపై చర్యలు చేపట్టలేదన్నారు. పిఒటి చట్టం 9/77లోని సెక్షన్ నెంబర్ 4 బిఐఐ సిసిఎల్ఎ వారు ఇచ్చిన ఆర్‌సి 7961/2007ను ఉల్లంఘిస్తూ, భాధితుల ప్రణాలతో చెలగాటం ఆడుతున్నారని నష్టపోయిన రైతులు కన్నీరు మున్నీరు పెట్టుకున్నారు. ఇంత జరుగుతున్న బాదితులను జిల్లా కలెక్టర్ పలకరించలేదంటే దీని వెనుక పెత్తందారుల ప్రభావం ఉందన్న అనుమానాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైన కలెక్టర్ లేపాక్షి మండలం కొండూరు గ్రామాన్ని సందర్శించి బాదితులతో చర్చించి, అధికారులతో దీనిపై సమగ్ర విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాదిత దళిత రైతులు పాల్గొన్నారు.

28న మూర్ఛ చికిత్సా శిబిరం

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని ఘనగిరి హైస్కూల్ ఆవరణలో ఈ నెల 28వ తేదీ పెనుకొండ జెవివి జోనల్ కమిటీ ఆధ్వర్యంలో మూర్ఛ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా కార్యదర్శి ఎ.హరి తెలిపారు. పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూర్ఛవ్యాధి గురించి శాస్త్రీయమైన అవగాహన పెంపొందించుకొని క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు. ప్రతినెలా నాల్గవ ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఇమ్రాన్, అధ్యక్షులు నబిసాబ్, రాజశేఖర్, ఇలియాజ్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు



కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకుంటున్న పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ : పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఉత్తమ అధికారిగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకున్నారు. నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ ఉత్తమ అధికారిగా సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. సబ్ కలెక్టర్ సిసిలు అనిల్, భరత్ ప్రశంసాపత్రాలు అందుకు న్నారు.

మడకశిర : గణతంత్ర దినోత్సవం వేడుకల్లో శుక్రవారం ఇందిరా క్రాంతి పథకం(ఐకెపి) ప్రాజెక్ట్ డైరెక్టర్ కెఎన్.నరసయ్య కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకున్నారు. మారుమూల ప్రాంత మైన అమ రాపురం మండలం గౌడనకుంట గ్రామానికి చెందిన కెఎన్.నరసయ్య అంచెలంచెలుగా ఎదిగి జిల్లా ఐకెపి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల బలోపే తానికి ఎంతో కృషి చేశారన్నారు. అందులో భాగంగానే ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారన్నారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఐకెపి పిడి నరసయ్య

సోమందేపల్లి : మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి అలేఖ్య, పోలీస్ కానిస్టేబుల్ నరేష్, మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి ఆదిలక్ష్మి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు.



కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకుంటున్న పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్



చిత్రపటాలకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చిత్రపటాలకు వినతిపత్రం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జిల్లాలోని డిఆర్‌డిఎ, వైకెపి, సెర్ఫ్ ఉద్యోగులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను దేశ నాయకుల చిత్రపటాలకు శుక్రవారం అందజేశారు. ఈ మేరకు వారు ఎనుములపల్లి గణేష్ కూడలిలో మహాత్మా గాంధీ, బి ఆర్ అంబేద్కర్ చిత్రపటాలను ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించి తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రామేశ్వరరెడ్డి. కో కన్వీనర్ రామ్మోహన్, జేఏసీ ప్రతినిధులు, డిపిఎం రమణప్ప ఏపీఎం నారాయణ, సిసి రామమోహన్, శంకర్ సూర్యనారాయణ ,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

ముదిగుబ్బ : మండలంలోని 33/11కేవీ రాళ్ల అనంతపురం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎఇ శివతేజ తెలిపారు. ఈ మేరకు ఎఇ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సహకరించాలని కోరారు.

'ఆడపిల్లలను చదవనిద్దాం'

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని కస్తూరిబా స్కూల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలు బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆడబిడ్డల్ని బతకనిద్దాం ఎదగనిద్దాం ఉన్నత చదువులు చదివిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 830/2022

Between:
మేక బయారెడ్డి S/o లేట్ మేక నరసింహారెడ్డి, వయస్సు 60 సం॥లు, హిందూ, వ్యవసాయము R/o D.No:2-147, కోనేరు స్ట్రీట్, కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. సెల్: 7993883839 ...వాది

ఎదిరి

కాసబత్తిని శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య, R/o D.No:3-27-A-4-1, కోనేరు వీధి, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై ప్రాంసరి నోటు బాకీ వసూలు నిమిత్తము పై కోర్టు నందు దావా వేసి యున్నారు. పై దావా వాయిదా తేది:01/02/2024 న ఉదయం 10:30 నిమిషాలకు పైన తెల్పిన కోర్టు నందు ప్రత్యక్షంగా గాని లేదా వకీలు ద్వారా హాజరై నీ యొక్క వాదనలు, అభ్యంతరములు తెలియపరుచుకోవలెను. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా:01/02/2024
స్థలం : కదిరి

ఎ.క్రిష్ణమూర్తి, ఎమ్.ఎ.,ఎల్.ఎల్.బి.,
వాదితరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 815/2022

Between:
Loyanapalli Subbanayudu s/o late L. Ramachandra, aged about 40 years, Hindu business and agriculturist, residing at Door No.3-57, K.Bathalapalli Village, Kadiri Post and Kadiri Rural Mandal, Site Sathyasai District. Cell No.9676639308. ...వాది

ఎదిరి

కాసబత్తిని శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య, R/o D.No:3-27-A-4-1, కోనేరు వీధి, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై మార్టిగేజ్ డీడ్ బాకీ వసూలు నిమిత్తము పై కోర్టు నందు దావా వేసి యున్నారు. పై దావా వాయిదా తేది:12/03/2024 న ఉదయం 10:30 నిమిషాలకు పైన తెల్పిన కోర్టు నందు ప్రత్యక్షంగా గాని లేదా వకీలు ద్వారా హాజరై నీ యొక్క వాదనలు, అభ్యంతరములు తెలియపరుచుకోవలెను. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా:12/03/2024
స్థలం : కదిరి

ఎ.క్రిష్ణమూర్తి, ఎమ్.ఎ.,ఎల్.ఎల్.బి.,
వాదితరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 878/2022

Between:
S.Sudharani, w/o Rajesh Naidu, aged about 30 years, Hindu, Housewife, residing at Door No.1-51, K.Bathalapalli village, Kadiri Mandal, Kadiri Municipality, Sree Sathyasai District. Mobile No:7702199728. ...వాది

ఎదిరి

కాసబత్తిని శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య, R/o D.No:3-27-A-4-1, కోనేరు వీధి, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై ప్రాంసరి నోటు బాకీ వసూలు నిమిత్తము పై కోర్టు నందు దావా వేసి యున్నారు. పై దావా వాయిదా తేది:29/02/2024 న ఉదయం 10:30 నిమిషాలకు పైన తెల్పిన కోర్టు నందు ప్రత్యక్షంగా గాని లేదా వకీలు ద్వారా హాజరై నీ యొక్క వాదనలు, అభ్యంతరములు తెలియపరుచుకోవలెను. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా:29/02/2024
స్థలం : కదిరి

ఎ.క్రిష్ణమూర్తి, ఎమ్.ఎ.,ఎల్.ఎల్.బి.,
వాదితరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692



బైక్‌ర్యాలీలో పాల్గొన్న నాయకులు

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి కదిరి అర్బన్

రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని సిఐటియు, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలను నిరసిస్తూ శుక్రవారం సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా నుండికాలేజ్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, నాయకులు వివి రమణ, శివన్న, వేమన్న, శ్రీరాములు, సిఐటియు నాయకులు జిఎల్ నరసింహులు, జగన్మోహన్, రామ్మోహన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపాలు, బాలకృష్ణ, జనార్ధన, ఎస్‌ఎఫ్ఐ నాయకులు విజయ్ , జిలాన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సవరించిందని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయడంలో విఫలమైందని విమర్శించారు. మరోవైపు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా చర్యలకు పాల్పడుతుందని అన్నారు. కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి శైలజనాథ్

ప్రజాశక్తి కదిరి అర్బన్

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 28న నిర్వహించే ఉమ్మడి జిల్లా పర్యటనను విజయవంతం చేద్దామనిమాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ పిలుపునిచ్చారు శుక్రవారం స్థానిక రోడ్లు భవనాల వసతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకునేందుకు పునాదులు వేసుకుంటున్నామని అన్నారు. వీటికి మొదటిగా వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామం అని అన్నారు ఈ నెల 28వ తేదీన సాయంకాలం నాలుగు గంటలకి కదిరి పట్టణానికి వైఎస్ షర్మిల చేరుకుంటారన్నారు. వైఎస్ షర్మిల మొదటిసారిగా ఉమ్మడి జిల్లాలో నిర్వహించే సభలను విజయంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సిపాయిల పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెటి. శ్రీధర్, శ్రీహరి ప్రసాద్‌చ ప్రతాపరెడ్డి , ఖాదర్‌బాషా, ఇందాయతుల్లాఖాన్, మునేంద్ర బాబు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న డాక్టర్ శైలజనాథ్

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

జగనన్న ఆధ్వర్యంలోని వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేపట్టిన వైఎస్ఆర్ రైతు చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఎనిమిదో రోజు తలమర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామ సచివాలయాన్ని, విలేజ్ హెల్త్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయం దండగ కాదు అది పండుగ అని నిరూపించామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ శంకర్, ఎంపీపీ రెడ్డిపరెడ్డి, మండల కన్వీనర్లు జగన్మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి , వైసిపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, వెంకట్ రాముడు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుక్కపట్నం : నియోజకవర్గంలోని 193 చెరువులను హంద్రీనీవా కాలువ ద్వారా నింపి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు జానకంపల్లి గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుకు జీవనాడి అయిన చెరువులను నింపి సాగునీరు అందించి రైతుల అభివృద్ధికి పాటపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ పద్మావతి, నాయకులు పతాంజలి, కేశప్ప, ఈశ్వర్, నాగభూషణం, నారాయణస్వామి, నగేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో పల్లె రఘునాథరెడ్డి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. సత్యమ్మ గుడి సర్కిల్లో ఉన్న చిరు వ్యాపారులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, నారాయణమ్మ, చిన్నగంగమ్మ, పార్వతమ్మ, శకుంతల, అనసూయమ్మ, లక్ష్మీదేవి తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మయ్య, సతీష్, వలి తదితరులు పాల్గొన్నారు

ఖాద్రీశుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామినిహైకోర్టు న్యాయమూర్తి మన్మధరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారికి ఆలయ కమిటీ ఛైర్మెన్ గోపాలక్రిష్ణ, ఈవో శ్రీనివాస రెడ్డి, ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు. కుమార్ రాజాచార్యులు, అంజన్ కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో న్యాయమూర్తి పాల్గొన్నారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, తహశీల్దార్ సునీత, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లింగాల లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

మున్సిపల్ పార్క్, ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

స్థానిక 29వ వార్డు సుందరయ్య నగర్‌లో మున్సిపల్ నిధులు, దాతలు కోటిరెడ్డి గంగిరెడ్డి శాంతమ్మల జ్ఞాపకార్థం రూ.8లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ పార్కు, ఓపన్ జిమ్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి ముందు కౌన్సిలర్ కోటి రెడ్డి సుజాత, వైసిపి నాయకుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, కాలనీవాసులు ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పార్కు, ఓపన్ జిమ్‌ను పరిశీలించారు. ఆనంతరం చిన్నపిల్లలతో జిమ్ లో సాధన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రిజర్వ్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీ దాతల సహకారంతో పార్కులు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. రిపబ్లిక్ డే రోజున ప్రజలకు అందుబాటులోకి తేవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, పట్టణ సిఐ సుబ్రమణ్యం, కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వార్డ్ ఇన్‌ఛార్జి కోటిరెడ్డి బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

అభివృద్దే ప్రధాన ధ్యేయం : పట్టణాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే తన ప్రధాన ధ్యేయమనిఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కళా జ్యోతి సర్కిల్ వద్ద గల మున్సిపల్ కాంప్లెక్స్ లోని 20 నూతన గదులను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పాల్గొన్నారు. 20 గదులను మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరాం రెడ్డి, శంషాద్ బేగం, మాజీ మున్సిపల్ చైర్మన్లు, పట్టణంలోని వివిధ వార్డు కౌన్సిలర్ల చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'పురం' వైద్యులు కేశవులుకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం జిల్లా ఆసుపత్రి విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్, హిందూపురం పట్టణానికి చెందిన డాక్టర్ కేశవులు గురువారం కేరళా రాష్ట్రంలో జాతీయ ఈవార్డును అందుకున్నారు. కేరళ రాష్ట్రం కొచ్చిన్ పట్టణంలో ఈ నెల 24 నుండి 28 తేదీ వరకు జరుగుతున్న అఖిల భారత చిన్న పిల్లల వైద్యుల జాతీయ సదస్సులో రెండు నేషనల్ అవార్డులతో పాటు సత్య సాయి జిల్లా చిన్నపిల్లల వైద్యుల సమాఖ్యకు 'నేషనల్ బెస్ట్ జిల్లా బ్రాంచ్ అవార్డులను కేశవులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతు వైద్యులందరికి సహకారంతోనే రెండు జాతీయ అవార్డులతో పాటు జిల్లాకు సైతం అవార్డు వచ్చిందన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కేశవులు

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

తనకల్లు : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని టి. సదుం గ్రామానికి చెందిన సుమారు 25 మైనార్టీకి చెందిన కుటుంబాలు టిడిపిలోకి శుక్రవారం చేరాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వైసిపి నాయకులు పి. అబూబకర్ సిద్దిక్, పి.ఖలందర్, ఎస్.కాలేష్, షేక్షావలి, ఖాదర్ వలి, బషీర్, బాబా, సమీర్, సలీమ్, దాదా ఖలందర్, షామీర్, ఇదుల్లా, మౌలా,ముస్తఫా, మస్తాన్, షబ్బీర్, సాదిక్, శంషాద్ వలి, మస్తాన్ తదితరులు పార్టీలో చేరారు. వీరికి కందికుంట వెంకటప్రసాద్ పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, శేఖర్ రెడ్డి , దేశాయి హరినాథ్ రెడ్డి , మాజీ కన్వీనర్లు శంకర్ నాయుడు, రాజారెడ్డి, నాయకులు రవీంద్ర రెడ్డి, మరేపల్లి రవీంద్ర రెడ్డి,చిక్కం మల్లికార్జున, శ్రీధర్ రెడ్డి, షబ్బీర్, మల్లెపూల రవి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

కర్నాటక మద్యం స్వాధీనం

నల్లచెరువు : మండల పరిధిలోని దామా వాండ్లపల్లి మారెమ్మ గుడివద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అమడగూరు మండలం ఏటిగడ్డ తండాకు చెందిన వ్యక్తి కర్నాటక మద్యం తరలిస్తుండగా ఎస్ఐ. లింగన్న ఆధ్వర్యంలో సిబ్బందితో దాడి చేసి అతని వద్ద నుండి 55 హై వార్డ్స్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

నంబుల పూలకుంట : మండల కేంద్రం మెట్ట కింద చర్చి దగ్గర ప్రభుత్వ స్థలాన్ని కొద్దిమంది ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అలా చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని తహశీల్దార్ నరేంద్రకుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ స్థలంలో జెసిబితో చదును చేస్తున్న విషయం తెలిసిన తహశీల్దార్ అక్కడి వెళ్లి పరిశీలించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కదిరి టౌన్ : పట్టణంలోని సైదాపురానికి చెందిన రాష్ట్ర రజక సంఘ కార్యదర్శి తెలికే ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

తప్పులతడకగా ఓటరు తుదిజాబితా

ధర్మవరం టౌన్ : ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సక్రమంగా జరిగినట్లు కనిపించడంలేదు. పట్టణంలో అధికార పార్టీ సానుభూతిపరుల ఓట్లు రెండుచోట్ల అధికంగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా మృతిచెందిన వారి ఓట్లు కూడా అలాగే ఉన్నాయి. వేరొక మండలంలో ఉన్న ఓట్లు కూడా పట్టణంలో దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన వారి ఓట్లు రెండుచోట్ల ఉన్నాయని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసిన ఏ ఒక్కటి తొలగించకపోగా ప్రతిపక్ష పార్టీ ఓట్లు మాత్రం తొలగించారని టిడిపి నాయకులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఒక్క 25వ వార్డులోనే ఇవి అధికంగా కనిపిస్తున్నాయంటే మిగిలిన వార్డుల్లో ఏస్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. 25వవార్డులోనే ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఓటు 225, 226 పోలింగ్ కేంద్రాల పరిధిలో 87, 407 సీరియల్ నెంబర్లలో ఉంది. అదేవిధంగా 227 పోలింగ్ బూత్లో సంజీవరెడ్డి అనే వ్యక్తి ఓటు రెండు చోట్ల ఉంది. మృతిచెందిన శంకరయ్య ఓటు అలాగే ఉంచారు. గ్రీస్మా అనే అమ్మాయికి వివాహమై మూడేళ్లక్రితమే అత్తారింటికి వెళ్లిపోయినా ఆమె ఓటు 226 పోలింగ్ కేంద్రంలోఉంది. అదేవిధంగా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో సంకాల లక్ష్మీదేవి, సంకాల చిన్నవెంకటరాముడు ఓట్లు ధర్మవరం పట్టణంలోని 225 పోలింగ్ కేంద్ర పరిధిలో ఉన్నాయి.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : పట్టణ పరిధిలోని ఎల్లప్పకుంట వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఉబ్బదేవర గంగమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి విరాళం అందజేశారు. విగ్రహ ఏర్పాటుకు రూ. 32 వేలను రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అసమ్మతి నాయకులపై చర్యలకు డిమాండ్

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలోని అసమ్మతి నాయకులపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు ఆపార్టీ అధ్యక్షులుకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గానికి చెందిన మున్సిపాలిటీ కన్వీనర్లు, ముఖ్యమైన నాయకులు శుక్రవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి నియోజకవర్గ పరిస్థితులపై వివరించారు. పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. అయితే కొందరు పార్టీకి దూరంగా ఉంటూ నియోజకవర్గంలో కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల ప్యాకేజీ కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులతో లాలూచీపడి పార్టీకి నష్టం చేకూరుస్తున్నారని అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పుట్టపర్తిలో జిల్లా కోర్టు ఏర్పాటు చేయండి

పుట్టపర్తి రూరల్: నూతనంగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లా లో జిల్లా కోర్టు కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి , జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ మన్మధరావు కు పుట్టపర్తి బార్ అసోషియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సత్యసాయి మహాసమాది దర్శనార్థం వచ్చిన ఆయనను శాంతిభవన్ అతిథిగృహం లో పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి అధ్వర్యం లో పుట్టపర్తి న్యాయవాదులు కలిశారు. 2017 లో పుట్టపర్తి కోర్టు ఏర్పాటయిందని వివరించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లాను2022 లో ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రస్తుతం నూతన జిల్లాలో 32 మండలాలు ఉన్నాయని జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జి .తో పాటు జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పుట్టపర్తి న్యాయవాదులు హైకోర్టు జడ్జికి సత్యసాయి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ జడ్జి రాకేష్, న్యాయవాదులు కృష్ణమూర్తి, లెక్కల యదుభూషన్, సతీష్‌రెడ్డి, రహమాన్, ఇందిర, వెంకట రమణప్ప తదితరులు పాల్గొన్నారు .

'పురం' అధికారులకు ప్రశంసాపత్రాలు

హిందూపురం : హిందూపురం పట్టణంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారులుగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందుకున్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, వన్ టౌన్ సిఐ శ్రీనివాస్, డాక్టర్ రోహిల్ కుమార్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ అమరేంద్రతో పాటు పోలీస్, ఇతర శాఖలో పని చేస్తున్న అధికారులకు, సిబ్బందికి ఉత్తమ అధికారులుగా ప్రశంస పత్రాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

ఎన్నికల సమయానికి వైసీపీ ఖాళీ : టిడిపి

కదిరి అర్బన్ : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సమయానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎవరు ఉండరని ఆ పార్టీ ఖాళీ అవుతుందని టిడిపి నియోజకవర్గ నాయకులు పవన్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో పట్టణ పరిధిలోని 14వ వార్డు వైసిపి నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా వైసిపి నాయకులకు కార్యకర్తలకు కందికుంట, పవన్ కుమార్‌రెడ్డి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

రజక మహాసభను విజయవంతం చేయండి

ముదిగుబ్బ : ఈనెల 28న అనంతపురంలో నిర్వహించే జిల్లా రజక మహాసభను విజయవంతం చేయాలని ఆసంఘం మండల అధ్యక్షుడు హరికృష్ణ కోరారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి అధికసంఖ్యలో రజకులు హాజరుకావాలని జిల్లా కార్యదర్శి లింగార్చన కోరారు.

ఎమ్మెల్యేపై తిరుగుబాటు

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైసిపి అసమ్మతి నాయకులు స్థానిక ఎమ్మెల్యేపై తిరుగుబాటు బావుటా ఎరుగవేశారు. ఈ మేరకు వారు శుక్రవారం పుట్టపర్తి సమీపంలోని ఒక తోటలో నిర్వహించారు. పాముదుర్తి, లోచర్ల, నల్లమాడ, ఒడిసి మండలాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి నియోజకవర్గం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అయితే ఎమ్మెల్యేకు తీవ్ర వ్యతిరేకత ఉందని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి టికెట్ ఇస్తే ఓడిపోవటం ఖాయమని వారు అన్నారు. ఎమ్మెల్యే పార్టీ క్యాడర్‌ను గాలికి వదిలేశారని ఎంతసేపు దళారులను వెంటబెట్టుకుని కార్యక్రమాలు నడుపుతున్నారని ఆరోపించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి కష్టపడిన కార్యకర్తల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈనేపథ్యంలో అధిష్టానం పుట్టపర్తి నియోజకవర్గం పైన ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. 2024 ఎన్నికలలో పుట్టపర్తి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి కాకుండా నియోజకవర్గంలోని స్థానికంగాఉండే ఏ నాయకునికైనా టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆరు మండలాల నుంచి దాదాపు 600 మంది కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు



ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం



ధర్మవరం వన్ టౌన్‌లో జెండావందనం చేస్తున్న సిఐ సుబ్రమణ్యం



పాంచజన్య పాఠశాలలో విద్యార్థులు పెరేడ్



కొడికొండ చెక్‌పోస్టు వద్ద కాలనీలో పతాకావిష్కరణ

రెపరెపలాడిన జాతీయ పతాకం

పుట్టపర్తి రూరల్: రాజ్యాంగ విలువల పరిరక్షణ దేశాభ్యుదయానికి దోహదం కలిగిస్తుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ స్పష్టం చేశారు . గురువారం 75 వ గణతంత్రదినోత్సవాలను పురస్కరించుకొని పుట్టపర్తి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు కోర్టు సిబ్బంది సమక్షం లో పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక ఉద్యోగి సీనియర్ అడ్వకేట్ వెంకట రమణప్పను ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమంలో పుట్టపర్తి బార్ ప్రెసిడెంట్ గంగిరెడ్డి, న్యాయవాదులు రహమాన్ , అమ్మినేని క్రిష్టప్ప, లెక్కల యదుభూషన్ ,రాజేంద్రప్రసాద్ రెడ్డి, పూజారి ప్రసాద్, వెంకట రమనప్ప, ఎన్ .శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్: మండలంలోని తలమర్ల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాల్గొని జెండా వందనం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో ఐఎఫ్‌పి బోర్డులు ప్రారంభించి, విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి, జెడ్పీటీసీ, సర్పంచులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా మండల పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతపురం ఉమ్మడి జిల్లాల ఏజీఎం. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్లమాడ : మండలంలో75 వ సంవత్సరం గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు నల్లమడ జిల్లా పరిషత్ హై స్కూల్లో హెచ్ఎం భాస్కర్ రెడ్డిజాతీయ పతాకం ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొండయ్య, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ దేవేందర్ నాయక్, పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు.

బుక్కపట్నం : 75వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో కరుణాకర్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరసింహుడు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుధామణి జెండాను ఆవిష్కరించారు.

పుట్టపర్తి రూరల్: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలును శ్రీ సత్య సాయి జిల్లా పోలీసు కార్యాలయంలో శు క్ర వారం ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్పీ విష్ణు జాతీయ జెండాను ఎగుర వేసారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ విజయ్ కుమార్, ఏవో సుజాత, ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి , సీసీ రాఘవేంద్ర, పోలీసు అధికారులు. జిల్లా పోలీసు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగాండ్లపెంట : మండల వ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో 75 వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాషా, ఎంపిడిఓ రామనాయక్, ఎస్ఐ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో 75 అక్షరం ఆకారంలో కూర్చొని వేడుకలు నిర్వహించారు.

పరిగి : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో విద్యాసంస్థలలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిపి సవిత ప్రభాకర్, సరస్వతి ఎస్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలువురు అధికారులు ఉత్తమ అధికారులకు అవార్డు పొందారు. ఎర్రగుంట ఆర్.బి.కె కేంద్రంలో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ అనసూయ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న శేషు, కవితా కేంద్రంలో శిక్షణ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మమత, జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందారు.

ఓబుళదేవరచెరువు : గణతంత్ర దినోత్సవ వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శ్రీ విజ్ఞాన్ పాఠశాలలో కరెస్పాండెంట్ మస్తాన్ ,విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ ఫక్రుద్దీన్, వశిష్ట స్కూల్ కారస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెడ్ యం. జయసింహారెడ్డి జెండా ఎగురవేశారు. ఇటీవల దేశ స్థాయిలో నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో విజయాన్ని సాధించిన 15 మంది విద్యార్థులను సన్మానించారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో గణతంత్రదినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమేశరెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండిశేషన్న, కోర్టులో సీనియర్ సివిల్ జడ్జీ గీతావాణి, ప్రిన్సిపుల్ సీనియర్ సివిల్ జడ్జీ శివపార్వతి, ఆడిషనల్ జూనియర్ సివిల్జీరమ్మసాయిలు జెండావిష్కరించారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ సుబ్రమణ్యం, టూటౌన్‌లో సీఐ అశోక్ కుమార్ పతాకాన్ని ఆవిష్కరించారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలో మువ్వన్నెల జెండా పట్టణంలోని సరస్వతి విద్యా మందిరంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వనిత క్లబ్ నీరజ వారి మిత్రబందంతో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

నంబుల పూలకుంట : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల జాతీయ జెండాను ఎగురవేశారు.

ధర్మవరం టౌన్ : విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు గూడూరు మోహన్‌దాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు హెచ్ఎం శైలజ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వేణుగోపాలచార్యులు, సభ్యులు మెటీకాల కుల్లయప్ప, గోశే రాధాకృష్ణ, మాజీ అధ్యక్షులు చందా నాగరాజు, పళ్లెం వేణుగోపాల్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ మాజీ కమిటీ, ప్రస్తుత కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరాంరెడ్డి, శంషాద్ బేగం, మాజీ మున్సిపల్ చైర్మన్లు, పట్టణ వార్డు కౌన్సిలర్లు, ఇన్చార్జులు పాల్గొన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను, ప్రతిభ కనబరిచిన కార్యాలయ సిబ్బంది, అధికారులను, సచివాలయ సిబ్బందిని సత్కరించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో డిపో మేనేజర్ సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం. మేరీ వర కుమారి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పుట్టపర్తి అర్బన్ : 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఓబుళపతి, కమిషనర్ రాంభూపాల్ రెడ్డి పతాక ఆవిష్కరణ గావించారు అలాగే కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అరుణ్ బాబు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నవీన్ కుమార్, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భాగ్యరేఖ, సత్య సాయి విద్యాసంస్థల్లో ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, కోర్టు ఆవరణలోజడ్జి రాకేష్,టిడిపి కార్యాలయంలో రఘునాథ్ రెడ్డి పతాకావిష్కరణ గావించారు.

హిందూపురం : 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాల, కళాశాలలతో పాటు మదరసాల్లో ఘనంగా జరిగాయి. పురపాలక సంఘంలో జరగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అథితులుగా ఇన్‌చార్జ్ దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు ఉద్యోగులు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయం వద్ద పార్లమెంట్ ఇన్‌చార్జ్ శాంతమ్మ, అసెంబ్లి ఇన్‌చార్జ్ దీపికలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ స్వర్ణలత, ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సిఐలు, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ నరేంద్ర కుమార్, ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ రెడ్డెమ్మ జెండా ఆవిష్కరించారు. పాంచజన్య పాఠశాలలో అద్యక్షులు శ్రీనివాసులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంజిఎం పాఠశాలలో హెచ్ఎం సామ్రాజ్యమ్మ, నేతాజి పాఠశాలలో హెచ్ఎం చంద్రశేఖర్, అజీజియా పాఠశాలలో హెచ్ఎం రంగనాయకులు, కల్లూరు సుబ్బరావు ఓరియంటల్ పాఠశాలఅలో పెనోబులం, ఆల్ ఆమీన్ పాఠశాలలో కరస్పాండెంట్ రియాజ్, హెచ్ఎం న్యాయతున్నీసా, వేణూ విద్యావిహార్‌లో వేణుగోపాల్, మనస్వీ పాఠశాలలో హెచ్ఎం నాగరత్న, సప్తగిరి కళాశాలలో శివశంకర్ రెడ్డి, బాలయేసు కళాశాలలో ప్రతాప్‌రెడ్డి, సువర్ణభారతి కళాశాలలో ప్రిన్సిపాల్ నీలకంఠారెడ్డి, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అద్యక్షులు నీలకంఠరెడ్డి, రెనాల్డ్ పాఠశాలలో కరస్పాండెట్ ముస్తపా అలీఖాన్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. ఎస్‌డిజిఎస్ కళాశాల ఆద్వర్యంలో 500 అడుగుల జాతీయ పతాకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు.

పెనుకొండ : 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాల యాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర్రావు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ముజాహిద్ సయ్యద్ ఫసల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు శివశర్మ, జావిద్, లక్ష్మీనారాయణ, నాగిరెడ్డి, అశ్వర్థనారాయణ, మోహన్‌నాయక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. టిడిపి కార్యాలయం వద్ద జెండా వందనం కార్యక్రమం నిర్వహించి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి ఆధ్వర్యం లో సీనియర్ నాయకులను సన్మానించారు. తన కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి సవితమ్మ జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన రిపబ్లిక డే వేడుకల్లో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, గౌరవాధ్యక్షులు వెంకటేష్ పాల్గొని వివిధ పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోఆర్డినేటర్ శెట్టిపల్లి నరసింహులు, కోశాధికారి రాంపురం రామాంజనేయులు, సభ్యులు లక్ష్మణ్ నాయక్ తదితరులు, పాల్గొన్నారు. ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, తదితర అంశాలపై నిర్వహించిన ర్యాలీ పట్టణ వాసులను ఆలోచింపజేసింది. చిన్నా రులు సాంస్కృతిక వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలల కరస్పాండెంట్ యు.శ్రీనివాసులు, హెచ్ఎం మంజువాణి, డైరెక్టర్స్ సాయిశ్రీధర్, సాయిసృజన విజేత విద్యార్థులకు బహుమతులు అంద జేశారు.

అమరాపురం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రమేష్‌బాబు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఈరన్న, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఓ గోపాలయ్య త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జడ్పీ హైస్కూల్‌లో జాతీయజెండాను ఎగరవేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. వారి వారి కార్యాలయాల్లో సర్పంచి వాగేష్, సర్పంచి తిప్పేస్వామి, చిత్తన్న, సదానందగౌడ, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్, నరేష్, గోపికృష్ణ, వీరన్న మువ్వన్నెల జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

రొద్దం : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. టిడిపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మండల కన్వీనర్ నరహరి, జిల్లా అధికారి ప్రతినిధి నరసింహులు, చిన్నప్పయ్య, రాము, నాగరాజు, మురళి, ఆది, క్రిష్టప్ప పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఓ రామారావు, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ మహబూబ్ పీరా, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ముని ప్రతాప్‌తో మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. పిహెచ్‌సి, ఎడిసిసి, వెలుగు కార్యాలయాలు, గ్రంథాలయం, సచివాలయా లు, విద్యాసంస్థల్లో గణతంత్ర వేడుకలను నిర్వహించారు.

లేపాక్షి : ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమర యోధుల వేషాధారణలో పుర వీధుల్లో దేశభక్తి గీతాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఒరియంటల్ పాఠశాల విద్యార్థులు 580 అడుగుల జాతీయ జెండా తో ర్యాలీ నిర్వహించారు. .

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు 805 సర్వేనెంబర్ జగనన్న గుడిసెల్లో వ్యకాసం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. అసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, సిపిఎం, నాయకులు, ఇళ్లస్థలాల సాధన కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జెండా ఎగురవేశారు.



మడకశిరలో జయహో బిసిల బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగుతమ్ముళ్లు



జయహో బిసి సదస్సులో మాట్లాడుతున్న బికె పార్థసారథి

వైసిపిని సాగనంపుదాం

'జయహో బిసి' సదస్సులో నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి అధ్యక్షతన 'జయహో బిసి' సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె. పార్థసారథి హాజరయ్యారు. బికె, గుండుమల మాట్లాడుతూ వైసిపి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ హయాంలో 26 మందికిపైగా బిసిలు హత్యకు గురయ్యారని, 650 మంది టిడిపి శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. బిసి సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ. 34 వేలు కోట్లు మళ్లించారని ఆరోపించారు. బిసిలు, మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను అధికార పార్టీ నేతలు ఆక్రమించుకున్నా రన్నారు. బిసి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థు లకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. బిసిలకు నామినేటెడ్ పదవులు అలంకారప్రాయమే అన్నారు. బిసి కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. బిసిలు బలహీనులు కాదని, వచ్చే ఎన్నికల్లో సత్తా చూపిస్తారన్నారు. అంతకుముందు పట్టణంలో గుండుమల ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి యాదవ కళ్యాణ మండపం వరకూ వెయ్యికి పైగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. టిడిపి, జనసేన పార్టీల శ్రేణులు పసుపు, జనసేన జెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గ పరిశీలకులు పులివెందుల పార్థసారథిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివా స్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు రంగయ్య, ఆనంద్, అంజనప్ప, మనోహర్, కృష్ణమూర్తి, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, బేగార్లపల్లి రవికుమార్, రామాంజనే యులు, సర్పంచులు రామాంజనేయులు, గుండుమల చంద్రప్ప, గుండుమల కరియప్ప, కన్వీనర్లు కుమారస్వామి, మద్దనకుంటప్ప, గణేష్, దాసిరెడ్డి పాల్గొన్నారు.

సిఎం జగన్‌లో ఓటమి భయం

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

ప్రజల తిరుగుబాటు ఊహించిన సిఎం జగన్ తరిమికొడతారనే భయంతోనే ఇప్పటికిప్పుడే తప్పుకుంటానంటూ కథలు చెబుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో 'ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే దిగిపోవడానికి ఎంత మాత్రం ఆలోచించనని జగన్ పేర్కొన్న వ్యాఖ్యలపై' స్పందించారు. 'జగన్ 2021లో నా వెంట్రుక కూడా పీకలేరు.. 2022లో నన్నే నమ్మండి.. 2023లో మిమ్మల్నే నమ్ముకున్నా.. 2024లో హ్యాపీగా దిగిపోతా'.. అంటున్నాడని ఎద్దేవా చేవారు. సిఎం జగన్ ఓడిపోతా రనే భయంతో దిగిపోతా అనడం లేదని, అస్తవ్యస్తమైన, దిక్కుమాలిన పాలనపై ప్రజల్లో వస్తున్న తిరుగుబాటును ఊహించి తప్పుకుంటున్నాడన్నారు. ముందే ప్రకటించి తప్పుకోకుంటే ప్రజలు తరిమికొడతారనే భయం జగన్‌లో స్పష్టమైందన్నారు. దిగిపోయినా సంతోషమే అనడం వెనుకా భారీ కారణం ఉందని ఐదేళ్లుగా ప్రజలను, ప్రజా వనరులను దోచుకుని రూ. 4 లక్షల కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. మరోవైపు ఇప్పటికే దాదాపు రూ. 10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశాడన్నారు. అప్పు పుట్టకుంటే ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేని స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడులను రాష్ట్రం నుంచి తరిమేశారన్నారు.

'పురం' మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు బదిలీ

హిందూపురం : హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమోద్‌కుమార్‌ను ఉమ్మడి కడప జిల్లా జమ్మలమడుగు మున్సిపాల్టీకి బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ ఉన్నత అధికారులు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సాధారణ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 92 మంది కమిషనర్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయనతో పాటు హిందూపురం పురపాలక సంఘంలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉంటూ పుట్టపర్తి మున్సిపాల్టీ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంభూపాల్ రెడ్డిని గుంటూరు జిల్లా రేపల్లే కమిషనర్‌గా బదిలీ చేశారు. హిందూపురం పురపాలక సంఘానికి కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లను ఇంకా నియమించలేదు.

వైసిపి పని అయిపోయింది : గుండుమల

ప్రజాశక్తి-అమరాపురం

రాష్ట్రంలో వైసిపి పనైపోయిందని, రాబోయేది టిడిపి-జనసేన ప్రభుత్వమేనని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో శుక్రవారం మండల కన్వీనర్ గణేష్, నరసింహామూర్తి ఆధ్వర్యంలో 'జయహో బిసి' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుండుమల హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బిసి సబ్ ప్లాన్ నిధుల నుంచి సుమారు రూ. 34 వేల కోట్ల నిధులు మళ్లించారని ఆరోపించారు. బిసిలు, మైనార్టీలకు ప్రభు త్వం ఇచ్చిన అసైన్ట్‌మెంట్ భూములను వైసిపి నేతలు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపిలో అధికారంలోకి రావడం తథ్యమని, బిసిలకు రక్షణగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, బంగారుపాళ్యం తిప్పేస్వామి, రఘు యాదవ్, రామ్‌రెడ్డి, శివరుద్రప్ప, హనుమంతరాయ, జయకుమార్, మల్లికార్జున, మంజునాథ్‌యాదవ్, మంజునాథ, అగ్రహారం నవీన్‌కుమార్, రామచంద్ర, నింగేగౌడ, తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

వైద్య శిబిరానికి విశేష స్పందన

గోరంట్ల : పట్టణంలోని షాదీ మహల్‌లో శుక్రవారం సామాజిక కార్యకర్త ఉమర్‌ఖాన్ ఆధ్వర్యంలో బెంగ ళూరు సిటీలోని సప్తగిరి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. ఉమర్‌ఖాన్ మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల అభినందిం చారు. శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సుప్రిత, మురళీకృష్ణ, జలక్ భరత్, హరిప్రియ, మానవతా రక్తదాన సంఘం అధ్యక్షులు షబ్బీర్, చాంద్, మల్లాపల్లి మహమ్మద్, వేణు, బొబ్బిలి, రామ్మోహన్, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉషశ్రీచరణ్‌రెడ్డి 'ఆత్మీయ పలకరింపు'

గోరంట్ల : 'ఆత్మీయ పలకరింపు'లో భాగంగా శుక్రవారం మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి మండల పరిధిలోని గడ్డంతండా, కల్లితండా గ్రామాల్లో పర్యటించారు. ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిని వివరించి, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికే మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాల్లో చరణ్‌రెడ్డికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచులు వాసునాయక్, నర్సిరెడ్డి, ఎంపిటిసి ఓబుల్‌రెడ్డి, ఉప సర్పంచి రాజారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, పద్మనాభరెడ్డి, శంకర్‌నాయక్, వరుణ్‌నాయక్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

'శ్రద్ధ ఇంటలెక్చువల్'కు ఎన్‌సిసి మంజూరు

మడకశిర : మండల పరిధిలోని పెనుకొండ రోడ్డులో ఉన్న రంగాపురం సమీపంలో నిర్వహిస్తున్న శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాలకు ఎన్‌సిసి మంజూరైనట్లు నిర్వాహకులు గుండుమల రాధాకృష్ణ తెలి పారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనే ప్రప్రథమంగా ఎన్‌సిసిని ప్రవేశపెట్టామన్నారు. విద్యార్థులు ఎన్‌సిసిలో శిక్షణ పొందితే క్రమశిక్షణతో పాటు సర్టిఫికెట్లు పొందవచ్చు అన్నారు. ఆ సర్టిఫికెట్లు ఉంటే విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ పొందవచ్చన్నారు.

షర్మిల మహాసభకు తరలిరండి

సోమందేపల్లి : అనంతపురం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్న మహాసభకు ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల హాజరవుతారని పార్టీ మండల కన్వీనర్ గంగాధర్ తెలిపారు. కావున మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

గోరంట రూరల్ : మండల పరిధిలోని బూదిలి గ్రామం జడ్పి హైస్కూల్‌లో 1991-92లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ. లక్ష వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. అందుకు కృషి చేసిన పెయ్యాల రాఘవేందర్‌రెడ్డిని అభినందించి సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు తాగునీరు ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల తరపున మెడికల్ స్టోర్ నంజుండ, పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ అంజి, హెచ్‌ఎం జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాఘవేంద్రరెడ్డి

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుక్రవారం స్థానిక రాజీవ్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి, రోడ్డుకు మట్టి వేసి గుంతలు చదునుచేశారు. కాలనీవాసులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శ్రీకృష్ణదేవరాయలు జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ భక్తవత్సలం, విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథ్‌రెడ్డి, బాలమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండియా-జార్జియా కల్చరల్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు



బెస్ట్ యూనివర్సిటీలో కల్చరల్ ఫెస్టివల్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో శుక్రవారం ఇండియా-జార్జియా కల్చరల్ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్క రించి గౌరవ వందనం చేశారు. అనంతరం విద్యార్థులు ఇండియా-జార్జియా సాంస్కృతిక, ప్రకృతి దృశ్యాలను నిర్వచించే వివరణ, సంప్రదాయాలు, సంగీతం, నృత్యం, దృశ్య కళలు ప్రదర్శించారు. యూనివర్సిటీ ఛాన్సలర్ రూప వాసుదేవన్ మాట్లాడుతూ ఇలాంటి మరెన్నో కల్చరల్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బెస్ట్ యూనివర్సిటీ ఛైర్మన్ భరత్‌లాల్‌మీనా, జార్జియా దేశస్థులు, స్థానిక యువత, బెస్ట్ యూనివర్సిటీ అధికారులు పాల్గొ న్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

హిందూపురం : పట్టణంలోని కొట్నూరు చెరువు కట్టపై శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కల్లూరు గ్రామానికి చెందిన బాలాజీ పట్టణంలోని మేళాపురం నుంచి కల్లూరుకు ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. ఇదే సమయంలో పట్టణానికి చెందిన బాబాఫక్రోద్దీన్ కొట్నూరు వైపు నుంచి హిందూపురం పట్టణానికి వస్తున్నాడు. ఈ రెండు ద్విచక్రవాహనాలు కొట్నూరు కట్టపై ఎదురెదురుగా ఢీ కొన్నాయి. వాహనాలపై ఉన్న బాలాజీ, బాబా ఫక్రోద్దీన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి వారిని చికిత్స నిమిత్తం ప్రవేటు అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలాజి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం బెంగుళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. బాబాఫక్రోద్దీన్ హిందూపురం అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రోడ్డు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి ప్రభుత్వ అసుపత్రి వచ్చి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బెంగళూరుకు రెఫర్ చేసిన బాలాజికి బెంగళూరు నిమెన్స్ అసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.